క్లుప్తంగా

రాజగోపుర నిర్మాణానికి విరాళం



దాతలకు బాండ్ అందజేస్తున్న ఆలయాధికారులు

కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి శనివారం భక్తులు విరాళం అందజేశారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం మల్లెందొడ్డి (మహబూబ్‌నగర్) వాస్తవ్యులు రంగస్వామి వారి కుటుంబ సభ్యులు రూ. 50వేలను దేవాలయ కార్యాలయంలో అందజేశారన్నారు. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలను చేయించి స్వామి వారి తీర్థప్రసాదం, శేష వస్త్రాలు, బాండు అందజేశారు.

వైభవంగా భీరప్ప దేవర



దేవతామూర్తుల ఊరేగింపు

మంత్రాలయం : మండలంలోని వగరూరు గ్రామంలో శనివారం భీరప్ప దేవర వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా గ్రామంలో దేవతామూర్తుల ఊరేగింపు చేపట్టారు. డోలు వాయిద్యాలు, పిల్లనగోవి, గొరవయ్యల విన్యాసాలు, పగటి దివిటీలతో పురవీధుల్లో ఊరేగించారు. సంప్రదాయబద్ధంగా ఆలయాన్ని చేరుకుని భీరప్ప స్వామి విశేష పూజలు గావించారు. ఎస్ఐ గోపీనాథ్ ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు.

వాయుపుత్రుడికి ప్రత్యేక పూజలు



పూజలందుకున్న ఆంజనేయస్వామి


కౌతాళం: మండలంలోని ఆంజనేయ స్వామి ఆలయాల్లో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల రాకతో ఆలయాలు సందడిగా మారాయి. మండల కేంద్రంవతో పాటు అగసలదిన్నె, బుదుములదొడ్డి, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజనేయస్వామి జాలయాల్లో స్వామి వారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజామున అర్చకులు స్వామికి సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి పూజలు చేపట్టారు. అలాగే స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో కూడా ప్రత్యేక పూజలు జరిగాయి.

కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన నీలకంఠప్ప



ఆదోని సెంట్రల్: కాంగ్రెస్ ఆదోని నియోజకవర్గ ఇన్‌చార్జ్ నీలకంఠప్ప తన పదవికి రాజీనామా చేశారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి కొన్నేళ్లుగా పనిచేస్తున్నానని.. తనను సంప్రదించకుండా ఎమ్మెల్యే అభ్యర్థిని ప్రకటించడంతో మనస్తాపం చెందానన్నారు. పార్టీని నమ్ముకుని కష్టపడిన వారిని కాదని కొత్తగా పార్టీలోకి వచ్చిన వారికి టికెట్ ఇవ్వడం సరి కాదన్నారు. అందుకే పార్టీకి రాజీనామా చేసినట్లు తెలిపారు. తన రాజీనామాను పార్టీ జిల్లా అధ్యక్షుడికి పంపినట్లు పేర్కొన్నారు.

బాలనాగిరెడ్డిని గెలిపించండి



ఓటర్లకు కరపత్రాలు అందజేసి అభ్యర్థిస్తున్న వై. సీతారామిరెడ్డి

మంత్రాలయం: మే 13వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి మా సోదరుడు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వై. బాలనాగిరెడ్డిని గెలిపించాలని టీటీడీ పాలక మండలి సభ్యుడు వై. సీతారామిరెడ్డి కోరారు. శనివారం స్థానిక సుజయింద్రీ నగర్‌లో ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఓటర్లకు కర పత్రాలు పంపిణీ చేసి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భీమారెడ్డి, మండల ఇన్‌చార్జ్ విశ్వనాథ్ రెడ్డి ఉన్నారు.

ఘనంగా చెన్నకేశవస్వామి కల్యాణం

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల పరిధిలోని ఎస్ పేరేముల గ్రామంలో శనివారం శ్రీలక్ష్మీభూదేవి చెన్నకేశవస్వామి కల్యాణం కడు రమణీయంగా జరిగింది. పండితుల వేదమంత్రోచ్చారణల మధ్య ఆలయ ప్రాంగణంలో స్వామి, అమ్మవార్ల కల్యాణం జరిగింది. భక్తులు పెద్ద ఎత్తున హాజరై కల్యాణాన్ని తిలకించారు. అంతకుముందు స్వామివార్ల మూలవిరాట్టుకు ప్రత్యేక పూజలు చేశారు.

శాంతిస్వరూపుడు వీరభద్రేశ్వరుడు

- రేపటి నుంచి స్వామివారి ఉత్సవాలు



భద్రకాళి సమేత వీరభద్రస్వామి


ఆదోని అర్బన్: పట్టణ శివారులోని రణమండలకొండపై వెలసిన వీరశైవుల ఆరాధ్యదైవం భద్రకాళి సమేత వీరభద్రస్వామి మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఆలయ కమిటీ చైర్మన్ దేవిశెట్టి మంజునాథ్ ఏర్పాట్లు పూర్తి చేశారు. మొదటి రోజు మహాగణపతి, ధ్వజారోహణం, ముద్దుమల్లికార్జునస్వామికి రుద్రాభిషేకం, రుద్రవీరభద్రకాళి హోమం, కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 11:45 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం జరుగుతుంది.అలాగే 12:30 గంటలకు మహాగణారాధన, సాయంత్రం 4 గంటలకు పట్టణంలోని శ్రీపేట వీరభద్రేస్వామి ఆలయం నుంచి భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయం వరకు రథాన్ని ఊరేగింపుగా తీసుకొస్తారు. రథోత్సవం జరగనుంది. 23న మంగళవారం స్వామివార్లకు రుద్రాభిషేకం, పూల అలంకారంతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సాయంత్రం 5:25 గంటలకు స్వామివార్ల ఉత్సవమూర్తులతో మహారథోత్సవం జరుగుతుంది. 24న బుధవారం సాయంత్రం స్వామివార్ల వసంతోత్సవం ఉంటుంది. మహోత్సవాలకు ముఖ్యఅతిథులుగా పీఠాధిపతులు హాజరవుతారు.



వీరభద్రస్వామి ఆలయం

ధనుర్మాసంలో సూర్యకిరణాలు

భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయ ప్రాంగణంలో వెలసిన ముద్దు మల్లికార్జునస్వామిని చూస్తే అచ్చం శ్రీశైల మల్లికార్జునస్వామిగా దర్శనమిస్తారు. ఆ స్వామివారికి కేవలం ధనుర్మాసంలో మాత్రమే సూర్యకిరణాలు పడతాయి. 20 ఏళ్ల క్రితం ప్రతి పౌర్ణమి శుభదినాల్లో వీరభద్రేశ్వరస్వామి, ముద్దు మల్లికార్జునస్వాములను ఓ పాము దర్శించుకుని వారి మెడకు చుట్టుకుని ఉంటుందని పెద్దలు చెబుతున్నారు. ప్రస్తుతం జనసంచారం ఎక్కువగా ఉండడం వల్ల ఎప్పుడో ఒకసారి పాము కనిపిస్తుందని హిరేమఠం ప్రధాన అర్చకులు తెలిపారు.



కొండరాయిపై ఉద్భవించిన వీరభద్రస్వామి

కొండరాయిపై వీరభద్రుడు

స్వామివారి ఆలయ సమీపంలో రణమండల ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లే మెట్ల వద్ద ఒక పెద్ద రాయికి వీరభద్రస్వామి ఉద్భవిస్తున్నాడు. కొన్నేళ్ల నుంచి చిన్నగా ఉంటూ ప్రస్తుతం స్వామి ఆకారంలో వీరభద్రస్వామి వారిగా రౌద్రం రూపంలో దర్శనమిస్తున్నారు. భక్తులకు స్వామివారి రూపం దర్శన భాగ్యం కలుగుతోంది.



ఉత్సవాలకు సిద్ధం చేసిన రథం

ఆమ్లేట్ విషయంలో ఘర్షణ

–కేసు నమోదు

ఆదోని అర్బన్: పట్టణంలోని రెడ్‌చిల్ బార్ అండ్ రెస్టారెంట్‌లో శుక్రవారం రాత్రి కస్టమర్, సర్వర్ మధ్య ఆమ్లేట్ విషయంలో ఘర్షణ చోటు చేసుకుంది. వన్‌టౌన్ సీఐ తేజమూర్తి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అమరావతినగర్‌కు చెందిన ఇషాక్ అనే యువకుడు రెడ్‌చిల్ బార్ అండ్ రెస్టారెంట్‌కు వెళ్లి ఎగ్ ఆమ్లేట్ ఆర్డర్ చేశాడు. సర్వర్ సిద్ధగౌడ్ ఆమ్లేట్ తెచ్చి పెట్టాడు. అది బాగాలేదు మరోసారి తీసుకురావాలని వెనక్కు పంపించాడు. సర్వర్ మరో ఆమ్లేట్ తీసుకొచ్చాడు. అది కూడా బాగా లేదని చెప్పడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. సర్వర్ సిద్ధగౌడ కస్టమర్ ఇషాక్ తలపై దాడి చేశాడు. గాయపడిన ఇషాక్‌ను ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిద్ధగౌడపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

టీడీపీ నేతలపై కేసు నమోదు

కోసిగి: టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి, మంత్రాలయం ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్.రాఘవేంద్ర రెడ్డి వర్గీయుల మధ్య శనివారం ఘర్షణ చోటుచేసుకుంది. తిక్కారెడ్డి అనుచరుడు, ఆంజనేయ స్వామి ఆలయ ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ అయ్యన్న, ఎన్. రాఘవేంద్ర రెడ్డితో కలిసిపోవడాన్ని సహించలేని ఎన్.రాఘవేంద్ర రెడ్డి అనుచరులు నాడుగేని చిన్న తాయన్న, నాడుగేని రంగడు వర్గీయులు దాడికి దిగారు. ప్రతి దాడిగా అయ్యన్న వర్గీయులు కర్రలతో దాడికి పూనుకున్నారు. దాడుల నేపథ్యంలో ఎస్ఐ సతీష్ కుమార్ ఇరువర్గాలపై కేసులు నమోదు చేశారు. ఇరువర్గాల్లోని ఏడుగురు చొప్పున కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

తిడితే ఓట్లు పడతాయనుకుంటే అవివేకమే

- పార్థసారథికి ప్రజలే బుద్ధి చెబుతారు
- ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని రూరల్: బీజేపీ అభ్యర్థి పార్థసారథి తనను తిడితే ఓట్లు పడతాయనే భ్రమలో ఉన్నారని.. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని..ఎన్నికల్లో వారే తగిన బుద్ధి చెబుతారని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. ఏం చేస్తాడో చెప్పుకోలేక తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని.. అతన్ని ఓటుతో చిత్తురుకు తరిమేందుకు నియోజకవర్గ ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. శనివారం ఆదోని మండలంలోని ధణాపురం గ్రామంలో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.3 లక్షల వరకు లబ్ధి చేకూర్చిందని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబునాయుడు 600 హామీలు ఇచ్చి రాష్ట్ర ప్రజలను మోసం చేశారన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజలకు నేనున్నాననే భరోసా కల్పించారన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలను అందించారని తెలిపారు. సంక్షేమ పాలన సాగించారన్నారు. అవినీతికి తావు లేకుండా అర్హులందరికీ లబ్ధి చేకూర్చారని చెప్పారు. ప్రజా సంకల్ప యాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చారని తెలిపారు. నాడు–నేడు పథకంలో ప్రభుత్వ ఆస్పత్రులు, పాఠశాలల రూపురేఖలు మారిపోయాయని చెప్పారు. వైఎస్సార్‌సీపీ హయాంలోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యపడిందన్నారు. ప్రజలు మరోసారి ఫ్యాను గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం గ్రామ టీడీపీ నాయకులు షణ్ముఖ, భీమతో పాటు పలువురు ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మధుసూదన్, పార్టీ జిల్లా అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ, రాష్ట్ర కార్యదర్శి గోపాల్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లుపోతుల సురేష్, నాయకులు మూర్తి, మాజీ సర్పంచ్‌లు ఎం.ఈరన్నగౌడ, మచ్చెటి ఈరన్నగౌడ, సర్పంచ్ చంద్రశేఖర్, ఎంపీటీసీ సభ్యుడు హనుమయ్య, డీలర్ శీనప్ప, సోమనాథ్‌గౌడ్, భీమ, షణ్ముఖ తదితరులు పాల్గొన్నారు.



ధణాపురంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మద్దతు తెలపండి

పెద్దకడబూరు : అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ మద్దతు పలకాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డి కోరారు. మండలంలోని దొడ్డిమేకల, కల్లుకుంట గ్రామాల్లో సర్పంచ్‌లు చంద్రశేఖర్, ఇస్మాయిల్ ఆధ్వర్యంలో శనివారం ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి ఎమ్మెల్యే అభ్యర్థిగా వై.బాలనాగిరెడ్డి, ఎంపీ అభ్యర్థి అయిన బీ.వై రామయ్యను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓట్లును అభ్యర్థించారు. అమలు కాని హామీలు ఇచ్చి ప్రజలకు మోసం చేయడం తమ పార్టీకి చేతకాదన్నారు. ఎన్నో హామీలతో 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ పాలనలో కేవలం జన్మభూమి కమిటీలు, టీడీపీ కార్యకర్తలకు మాత్రమే ప్రభుత్వ పథకాలు అందాయని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ పాలనలో పేదరికాన్ని మాత్రమే కొలమానంగా తీసుకొని అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సొంతమన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయ కమిటీ సభ్యుడు విజయేంద్రరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రవిచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ రఘురాముడు, మాజీ సర్పంచ్‌లు వెంకటేశ్వరరెడ్డి, బాలమునిస్వామి, నాయకులు శివారామిరెడ్డి, గజేంద్రరెడ్డి, శివారెడ్డి, నవీన్‌రెడ్డి, ముక్కరన్న, అర్లప్ప, పూజారి ఈరన్న, సత్యనారాయణగౌడ్, నాగేష్, యల్లప్ప జాము మూకయ్య పాల్గొన్నారు.



దొడ్డిమేకలలో వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న వై.ప్రదీప్‌రెడ్డి

గ్యాస్ ప్రమాదాలపై అవగాహన

ఆదోని అర్బన్: అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాల నుంచి బయటపడవచ్చని అగ్నిమాపకశాఖ అధికారి రామాంజనేయులు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం పట్టణంలోని అగ్నిమాపక కేంద్రం వద్ద మహిళలకు గ్యాస్ ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎక్కువ శాతం ప్రమాదాలు బీడీలు, సిగరెట్లు తాగి పడేసినప్పుడే జరుగుతున్నాయని తెలిపారు. బీడీలు, సిగరెట్లు తాగిన వెంటనే ఆర్పి వేయాలని సూచించారు. ఇంట్లో అగ్గిపెట్టె, లైటర్‌లను పిల్లలకు దూరంగా ఉంచాలని సూచించారు. గ్యాస్ లీక్ అయినప్పుడు ఇళ్లలో కరెంట్ స్విచ్‌లు ఆన్, ఆఫ్ చేయరాదన్నారు. అనంతరం గ్యాస్ ప్రమాదాలపై డెమో చేసి చూపించారు.



మహిళలకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

గడ్డివాములు దగ్ధం

మద్దికెర: మండల కేంద్రానికి చెందిన రైతులు వీరేష్, సుధాకర్‌ల రెండు గడ్డివాములు శనివారం తెల్లవారుజామున దగ్ధమయ్యాయి. కొత్తపల్లి రహదారిలో ఏడు ట్రాక్టర్ల పశుగ్రాసాన్ని నిల్వ ఉంచుకున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు వాములుకు నిప్పు పెట్టినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.



మంటలకు దగ్ధమవుతున్న గడ్డివాములు

ఫ్యాన్ గుర్తుపై ఓటేద్దాం.. అభివృద్ధిని గెలిపిద్దాం

కోసిగి: ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అందరి సంక్షేమానికి, అభివృద్ధికి కృషి చేస్తున్న వైఎస్సార్‌సీపీని మరోసారి గెలిపించాలని ఎంపీపీ ఈరన్న, బుళ్లి నరసింహులు, పెండేకంటి భాస్కర్ కోరారు. శనివారం కోసిగిలోని కొత్తపేట , కింద మారెమ్మ దేవి కాలనీలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. వారు మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించి అభివృద్ధిని కొనసాగించుకుందామని తెలిపారు. గతంలో చంద్రబాబు నాయుడు పరిపాలన చూసి మోసపోయామన్నారు. మళ్లీ టీడీపీకి ఓటు వేస్తే సంక్షేమ పథకాలు రద్దవుతాయని, గతంలోని ఇబ్బందులు మళ్లీ మొదలవుతాయని చెప్పారు.



కరత్రాలు అందజేసి ఓటర్ల అభ్యర్థిస్తున్న ఎంపీపీ ఈరన్న

27 మంది వలంటీర్ల రాజీనామా



ఎంపీడీఓకు రాజీనామా పత్రాలను అందజేస్తున్న వలంటీర్లు

ఆదోని రూరల్: ఆదోని మండలంలో శనివారం 27 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. జి.హొసళ్లి నుంచి హుసేని, గణేష్, మూలింటి శేఖన్న, చిన్నపెండేకల్ నుంచి చిక్కిలి మల్లికార్జున, భీమా, సంతెకూడ్లూరు–2 సచివాలయం నుంచి అలిగేరి కుమార్, బలాదూర్ శ్రీలత, కె.సుజాత, బలాదూర్ రోషన్, నందిని, తేజస్విని, కుప్పగల్ నుంచి ఉమా దేవి, విజయలక్ష్మి, మునిస్వామి, కృష్ణమూర్తి, రఘునాథ్, రామేశ్వరి, మల్లికార్జున, శ్రీనివాసులు, బసాపురం నుంచి రాఘవేంద్రరెడ్డి, వీరారెడ్డి, చిన్నపెండేకల్ నుంచి సునీత, రహమత్‌బీ, గణేకల్ నుంచి వెంకటమ్మ, వీరేశమ్మ, భారతి, జాలిమంచి నుంచి సునీత రాజీనామాలు చేశారు. తమ రాజీనామా పత్రాలను ఇన్‌చార్జి ఎంపీడీఓ విజయశేఖర్‌రావు, పంచాయతీ కార్యదర్శి కృష్ణకు అందజేశారు. తాము స్వచ్ఛందంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటామని, సీఎం జగనన్నను గెలిపించుకుంటామని తెలిపారు.

వలంటీర్ల రాజీనామా

కౌతాళం: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఏడుగురు వలంటీర్లు శనివారం రాజీనామా చేశారు. బాపురం గ్రామంలో నలుగురు, లింగాలదిన్నె గ్రామానికి చెందిన ముగ్గురు రాజీనామ పత్రాలను గ్రామ కార్యదర్శులతో కలిసి ఎంపీడీఓకు అందజేశారు.రాజీనామా పత్రాలను ఉన్నత అధికారుల దృష్టికి పంపిస్తామని ఎంపీడీఓ రఘునాథ్‌గుప్తా తెలిపారు.

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీలో 14 మంది వార్డు వలంటీర్లు శనివారం రాజీనామా చేశా రు. 21వ వార్డులో ప్రభుదాసు, 34వ వార్డులో వంశీ, రిజ్వానా, పవన్‌కుమార్, అనంతకుమార్, మంజుల, భారతి, ఉమాదేవి, తాయ మ్మ, వెంకటలక్ష్మి, సైదుల్లా, కై లాశ్‌కుమార్, చంద్రకళ, సుంకన్నతో పాటు రూరల్‌లోనూ 27 మంది తమ పదవులకు రాజీనామా చేశారు.

రేపు శ్రీరామలింగేశ్వర స్వామి రథోత్సవం

కోసిగి: మండలంలోని కందుకూరు గ్రామంలో తుంగభద్ర నది ఒడ్డున వెలసిన శ్రీ రామాలింగేశ్వర స్వామి మహా రథోత్సవం ఈనెల 23వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు తెలిపారు. శనివారం వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బెట్టన గౌడ గ్రామ పెద్దలతో కలిసి ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డిని, వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి. మురళీమోహన్ రెడ్డికి రథోత్సవ ఆహ్వాన పత్రికను అందజేశారు.

సారా తయారు చేస్తున్న వ్యక్తి అరెస్టు

ఆదోని రూరల్: మండలంలోని దిబ్బనకల్ గ్రామ కొండల్లో సారా తయారు చేస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు తాలూకా ఎస్ఐ ఎర్రిస్వామి శనివారం తెలిపారు. ఆదోని పట్టణం బోయగేరికి చెందిన వెంకటేష్ దిబ్బనకల్ కొండల్లో సారా కాస్తుండగా పట్టుకున్నామన్నారు. అతని వద్ద నుంచి 50 లీటర్ల సారా, 50 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

బీజేపీ అభ్యర్థిపై ఎన్నికల అధికారికి ఫిర్యాదు

ఆదోని రూరల్: బీజేపీ ఆదోని ఎమ్మెల్యే అభ్యర్థి పార్థసారథి ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించారని శనివారం సాయంత్రం ఆదోని వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు దేవా ఎన్నికల అధికారి, సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మకు ఫిర్యాదు చేశారు. ఆదోని 19వ వార్డు ఇందిరానగర్‌లోని టీచర్స్ కాలనీ చర్చిలో బీజేపీ అభ్యర్థి పార్థసారథి ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించారని పేర్కొన్నారు. ప్రార్థన మందిరంలో పాస్టర్ శ్రీధర్ సమక్షంలోనే సమావేశం నిర్వహించారన్నారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై విచారణ చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి ఎన్నికల అధికారి ఆదేశించారు. ఎవరు ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించినా చర్యలు తప్పవని ఎన్నికల అధికారి స్పష్టం చేశారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోండి

వెల్దుర్తి(కృష్ణగిరి): ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని వెల్దుర్తి సీఐ సురేశ్‌కుమార్ రెడ్డి, ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి ప్రజలకు సూచించారు. శనివారం వారు కేంద్ర సాయుధ బలగాలతో రత్నపల్లె, గోవర్ధనగిరి, బోగోలు, లక్ష్మీనగరం గ్రామాల్లో కవాతు నిర్వహించారు. గ్రామస్తులను సమావేశపరిచి గొడవలకు దూరంగా ఉండాలని సూచించారు.



కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తున్న సీఐ, ఎస్ఐ

23న సిద్ధ రామేశ్వర స్వామి రథోత్సవం

ఆస్పరి: మండలంలోని చిన్నహోత్తూరులో వెలసిన సిద్ధరామేశ్వర స్వామి, బనవనూరులో సుంకులమ్మవ్వ రథోత్సవం ఈనెల 23న నిర్వహించనున్నట్లు సర్పంచ్‌లు పెద్దరెడ్డి, హరిక్రిష్ణ తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ ఆలయాల్లో సుంకులమ్మవ్వ, స్వామి వారికి గంగ, ఆకు పూజ, ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాల అనంతరం రథోత్సవం ఉంటుందన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు

- ఆదోని ఎన్నికల అధికారి, సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ

ఆదోని రూరల్: పోలింగ్ కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదోని ఎన్నికల అధికారి, సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ ఆదేశించారు. శనివారం ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సెక్టరల్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏప్రిల్ 30వ తేదీ నాటికి పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులైన తాగునీరు, విద్యుత్, షెడ్, ఫర్నీచర్, సైన్‌బోర్డులు, బారికేడ్లు, టాయిలెట్స్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అందరూ సమన్వయంతో విధులు నిర్వహించాలని సూచించారు. పోలింగ్ ప్రక్రియ ముగిసే వరకు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాల వివరాలు, రూట్ మ్యాప్‌లను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. పీఓ, ఏపీఓల శిక్షణలో తప్పకుండా పాల్గొని సందేహాలను తీర్చాలన్నారు. ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా పోలింగ్ కేంద్రాల్లో వాతావరణం ఉండేలా చూడాలని ఆదేశించారు. ఈవీఎంల మేనేజ్‌మెంట్‌పై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు. మే 13వ తేదీ పోలింగ్ ప్రక్రియ ప్రారంభమయ్యేందుకు మూడు గంటల ముందుగా సెక్టోరల్ అధికారులు పూర్తిస్థాయిలో పర్యవేక్షించాలని తెలిపారు. గంటన్నర ముందుగా మాక్ పోలింగ్ నిర్వహించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో పీడబ్ల్యూడీ, సీనియర్ సిటిజన్ ఓటర్లు క్యూలో వేచి ఉండకుండా ఓటు వేసేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీల్‌చైర్స్ ఏర్పాటు చేసి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఓటు హక్కు వినియోగించుకునే విధంగా చర్యలు చేపట్టాలని సెక్టోరల్ అధికారులకు సూచించారు. సమావేశంలో తహసీల్దార్ హసీనా సుల్తానా పాల్గొన్నారు.



సెక్టోరల్ అధికారులతో సమీక్షిస్తున్న ఆదోని ఎన్నికల అధికారి శివనారాయణశర్మ

పిడుగుపాటుకు కాడెద్దుల మృతి



మృతిచెందిన కాడెద్దుల వద్ద రైతు, వీఆర్ఓ

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల పరిధిలోని లింగాలపల్లె గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి పిడుగుపాటుకు కాడెద్దులు మృతి చెందాయి. బాధిత రైతు పింజరి బాషా తమ కాడెద్దులను ఆరుబయట కట్టి వేసి నిద్రించారు. రాత్రి ఉరుములు, మెరుపులతో పాటు పిడుగు పడింది. ఈ ఘటనలో కాడెద్దులు మృతిచెందాయి. విషయం తెలుసుకున్న వీఆర్ఓ ఎల్లకృష్ణ శనివారం ఉదయం ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. జీవనాధారమైన కాడెద్దుల మృతితో రూ.లక్ష నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు.

IN THE COURT OF THE HONBLE SENIOR CIVIL JUDGE
AT : KAMAREDDY
H.M.O.P. No. 106 of 2022
Between :
Smt. Udayagiri @ Bandi Shruthi ...Petitioner
AND
Bandi Srikanih ...Respondent
To,
Bandi Srikanth, S/o. Late Bandi Subbanna, aged about 43 years, Hindu, Occ: Manager at Spinning Mill at Yadhadhri District, R/o. H.No. 15/81-1, Langarabhavi, Adoni, Kurnool District-518301.
Take notice that above named petitioner has file above petition against you for decree of divorce and sent notices several times to you, but same were returned as un-served.
Hence the Hon'ble Court order to Notice through Substitute service by publishing in any Daily News Paper.
The above case stands posted on 28-04-2024 at 10-30 am for your appearance before the above court and to answer the claim, failing which you will be set ex-parte and case will be decided on merit.
// BY ORDER OF COURT //
K. SHYAM GOPAL RAO
B. NARAYANA
Counsels for the petitioner

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఆదోని, మంత్రాలయం
97054 44304 (ఆదోని)
70750 09147 (మంత్రాలయం)
Office mail : sakshiknladvt@gmail.com